మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగాలి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఫిబ్రవరి 3 : విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంగ్లీష్ పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు వెతుకుంటు వస్తాయన్నారు. మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, ప్రిన్సిపాల్ రాము, ఎస్ఐ మహేందర్‌లాల్, సర్పంచ్ బచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మించాలని వినతి

వలిగొండ : మండలంలో మినీ స్టేడియం నిర్మించాలని ఎఫ్ఎస్‌సీఏ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనువైన స్థలాన్ని గుర్తించి స్టేడియం నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొండూరి బాలరాజు, గంజి చండీప్రసాద్, కొండూరి భాస్కర్, కాసుల వెంకన్న, కూర శ్రీనివాస్, యానాల సత్యనారాయణ రెడ్డి, స్వామిరాజు, పిట్టల రాజు, అయిటిపాముల ప్రభాకర్ పాల్గొన్నారు.

రాంరెడ్డి మృతికి నివాళి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పెద్దగూడేనికి చెందిన కందాడి రాంరెడ్డి(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి

సావిత్రమ్మ కుటుంబసభ్యులకు జిట్టా పరామర్శ

వలిగొండ, ఫిబ్రవరి 3 : మండలంలోని జంగారెడ్డిపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది బద్దం నర్సింహారెడ్డి తల్లి సావిత్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి శనివారం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గోమారి సుధాకర్‌రెడ్డి, మందడి జితేందర్‌రెడ్డి, మస్కు నర్సింహ, నానచర్ల రమేశ్, కొండూరి సత్తయ్య, అంబటి మోహన్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : మండలంలోని అనంతారం జడ్పీహెచ్ఎస్‌లో 1995 – 96 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. విద్యాబోధనలు నేర్పిన గురువులను సన్మానించారు.

ఆలయంలో నిర్వహించిన విచారణలో పాల్గొన్న అధికారులు

అవినీతి ఆరోపణలపై విచారణ

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ అతికం లక్ష్మీనారాయణ అవినీతికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఆ గ్రామ నాయకుడు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య యాదవ్ దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా శనివారం ఆలయంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఎండోమెంట్ అధికారి నరేందర్‌రెడ్డి సమక్షంలో విచారణ జరిపారు. నివేదికను పై అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కంబాలపల్లి భిక్షపతియాదవ్, మట్ట శంకర్ బాబు, బత్తిని నరేశ్‌కుమార్‌గౌడ్, ఎల్లంల వెంకటేశ్‌యాదవ్, జిట్టా అశోక్‌రెడ్డి, బత్తిని సుధాకర్‌గౌడ్, మట్ట బాలకృష్ణగౌడ్, మట్ట సైదులుగౌడ్, సురూపంగా నరసింహ, సురూపంగా కిష్టయ్య, ఏల్లంల నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఫిబ్రవరి 5 నుంచి ఇంటింటికీ సీపీఎం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3: జిల్లాలో ఫిబ్రవరి 5 నుంచి 25 వరకు ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. శనివారం భువనగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

పది రోజుల్లో కొత్త దుకాణాలు ప్రారంభం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- గుట్ట ఆలయ అభివృద్ధిలో షాపులు కోల్పోయిన వారికి పొజిషన్ సర్టిఫికెట్ల అందజేత

లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 : యాదగిరిగుట్ట కింద రోడ్డు బాధితులకు కేటాయించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను పది రోజుల్లో ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం యాదగిరిగుట్టలో ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రహదారి వెంట షాపులు కోల్పోయిన 135 మందికి నూతన దుకాణాల పొజిషన్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానాన్ని నమ్ముకుని జీవించే స్థానికులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మరికొంత మందికి షాపులు రాలేదని, త్వరలో వారికి వచ్చేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్, ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, జడ్పీటీసీ తోట కూరి అనూరాధ, కౌన్సిలర్లు ముక్కర్ల మల్లేశ్, గౌలికార్ అరుణ పాల్గొన్నారు.

జడ్పీటీసీకి అవమానం..

ప్రధాన రహదారిలో షాపులు కోల్పోయిన లబ్ధిదారులకు పోజిషన్ సర్టిఫికెట్ల పంపిణీకి హాజరైన జడ్పీటీసీ తోటకూరి అనూరాధకు అవమానం జరిగింది. పంపిణీకి ఆహ్వానించిన తాసీల్దార్ వెంకటేశ్వర్లు కనీసం ఆమెను మాట్లాడించకుండానే కార్యక్రమాన్ని ముగించారు. దీనిపై ఆయనను వివరణ కోరగా మున్సిపాలిటీ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్, కౌన్సిలర్లదే ప్రోటోకాల్ ఉంటుందని, జడ్పీటీసీకి ప్రాధాన్యం ఉండదని చెప్పారు. ఇదే విషయంపై జడ్పీటీసీ మాట్లాడుతూ కనీసం సభా మర్యాదలను పాటించడం లేదని, తనకు ప్రాధాన్యత లేని కార్యక్రమానికి పిలిచి అవమాన పరచడం అధికారులకు సరైంది కాదన్నారు. దీనిపై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

పడమటిసోమారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

బీబీనగర్, ఫిబ్రవరి 3 : అర్హులందరికీ ఉపాధి హామీ పని కల్పించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని పడమటి సోమారంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి దోహదపడే పనులు, కూలీలకు గరిష్ట వేతనం వచ్చే పనులను గుర్తించాలన్నారు. కూలీలకు వేతన పే స్లిప్‌లను సకాలంలో అందించాలన్నారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి శ్రీవాణి, మండల పంచాయతీ అధికారి స్వాతి, ఏపీఓ కళావతి, పంచాయతీ సెక్రటరీ వేణు, టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

రాజాపేట : రఘునాథపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు

రాజాపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని రఘునాథపురం జడ్పీహెచ్ఎస్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పాత్రల్లో విద్యార్థులు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు బింగి భాస్కర్, నాగలక్ష్మి సంపత్, భవాణి, పద్మావతి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చామంతి, బాలభవాని, నవమి, నిరద పాల్గొన్నారు.

బొమ్మలరామారం జడ్పీహెచ్ఎస్‌లో

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు సీతారాంరెడ్డి, భాస్కర్, స్టాలిన్, కుమారస్వామి పాల్గొన్నారు.

కూరెళ్లను సన్మానిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం

రామన్నపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని వెల్లంకిలో ప్రముఖ సాహితీవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలచార్యను శనివారం బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాప అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణాత్మక నిర్ణయాలతో యువతకు, విద్యార్థులకు కూరెళ్ల ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కలిమెల నర్సింహ, బుంగ యాదయ్య, కూరెళ్ల నర్సింహాచారి పాల్గొన్నారు.

చైర్మన్ అయిలయ్యను, డైరెక్టర్లను సన్మానిస్తున్న శివాజీ యూత్ క్లబ్ సభ్యులు

రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ కార్యవర్గాన్ని శనివారం శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ గుండెగాని అయిలయ్యగౌడ్, డైరెక్టర్లు సత్తయ్య, నర్సయ్య, శేఖర్, ఏలెందర్, శ్రీను, పరశురాములు, గోవర్ధన్‌రెడ్డి, నరేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కూరెళ్లలో మాజీ సర్పంచ్ ఉప్పలయ్య, పాలకవర్గం సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- కూరెళ్ల మాజీ సర్పంచ్ ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని కూరెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన వీడ్కోల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాన్ని రూ.5కోట్ల నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీసీ రోడ్లు, రైతు వేదిక, వైకుంఠ ధామం, డంపింగ్‌యార్డు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనం, కమ్యూనిటీహాల్‌ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మ, పంచాయతీ కార్యదర్శి గుర్రం వినోద్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ కొమ్ము నరేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించరా?

- ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.10 వేలు జీవన భృతి ఇవ్వాలి
- బీజేపీ నాయకుడు శ్యామ్‌సుందర్‌రావు

ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్లకు నివాళులర్పిస్తున్న శ్యామ్‌సుందర్‌రావు, ఆటో డ్రైవర్లు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : ఉపాధి కోల్పోయి కుటుంబం గడవక ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించరా అని బీజేపీ నాయకుడు శ్యామ్‌సుందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఆటో యూనియర్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి నెలకు రూ.10 వేల భృతి అందించాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన తెస్తామని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజావ్యతిరేకిగా మారిందన్నారు. అనాలోచిత విధానాలతో ఒక హామీ అమలు చేసే హడావుడిలో ఆటో డ్రైవర్ల పొట్టకొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో పోతంశెట్టి రవీందర్, నర్ల నర్సింగ్‌రావు, చంద మహేందర్, పిట్టల అశోక్, వేముల అశోక్, మాయ దశరథ, జనగాం నర్సింహచారి, ఉపేందర్, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ న్యాయవాదుల అసోసియేషన్

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చంద్రమోహన్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : ముదిరాజ్ న్యాయవాదుల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భువనగిరికి చెందిన న్యాయవాది పోతాల చంద్రమోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర కార్యవర్గం హైదరాబాద వలో శనివారం నియామక పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ముదిరాజ్‌లకు ఉచితంగా కోర్టులో దావా వేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

బడ్జెట్ ప్రతులను తగలబెడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

బడ్జెట్‌లో ఉపాధి అవకాశాలను విస్మరించిన కేంద్రం

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధి అవకాశాలను విస్మరించేలా ఉందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గ నవీన్, గడ్డం వెంకటేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ వినాయక చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, రెండు లక్షలు కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

- వెల్మజాల గ్రామ ప్రత్యేకాధికారి జనార్దన్‌రెడ్డి

పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జనార్దన్‌రెడ్డి

గుండాల, ఫిబ్రవరి 3 : స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని వెల్మజాల గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామపంచాయతీ రికార్డులను, ఉపాధి హామీ పనులు, నర్సరీ నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దోమల రాజు ఉన్నారు.

భువనగిరి ఎంపీ స్థానానికి కుంభం కీర్తిరెడ్డి దరఖాస్తు

గాంధీ భవన్‌లో దరఖాస్తు అందిస్తున్న కుంభం కీర్తిరెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3 : భువనగిరి ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కేకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూతురు కీర్తిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, శిరీశ్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, బొల్లా శ్రీనివాస్, పాశం సత్తిరెడ్డి, ఎండి.అవేస్ చిస్తీ, చిక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని మండలంలోని చామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి శనివారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, ఉపాధ్యక్షుడు భూమండ్ల అశోక్, మేడికుంటపల్లి ఉప సర్పంచ్ ఎలిమినేటి జంగారెడ్డి ఉన్నారు.

మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్‌లో 6, 7వ తరలగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ నరేశ్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని చందుపట్లకు చెందిన సుబ్బూరు మల్లయ్య(53) కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ చందుపట్ల బ్యాంకు సంఘ సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ.30వేల ఆర్థిక సాయాన్ని చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎలిమినేటి మల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన బత్తి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఎంపీటీసీ బుడిగి రేణుకాపెంటయ్యగౌడ్ శనివారం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పోచయ్య, బాలరాజు, సత్తయ్య, భాస్కర్, సంపత్, రామ్, విజయ్, అనిల్, నరేశ్ పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్ర కమిటీ సభ్యుడిగా అజయ్

అజయ్

రామన్నపేట, ఫిబ్రవరి 3 : నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ జిల్లా సలహా కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన దావూనూరి అజయ్‌ను నియమిస్తూ కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ శనివారం ఉతర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

బొమ్మలరామారం, ఫిబ్రవరి 3 : ఈ నెల 5న యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహస్వామి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు జరిగే బీఆర్ఎస్ ఆలేరు నియోజవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశానికి తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డితో పాటు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొంటాని తెలిపారు.

వెంకిర్యాలలో ఆలయ చైర్మన్‌కు నగదు అందజేసిన ధనుంజయగౌడ్

ఆలయ నిర్మాణానికి విరాళం

బీబీనగర్, ఫిబ్రవరి 3 : మండలంలోని వెంకిర్యాలలో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన చెరుకు ధనుంజయగౌడ్ కుటుంబసభ్యులు రూ.1,00,116 విరాళాన్ని శనివారం ఆలయ చైర్మన్ రాచమల్ల లక్ష్మీపద్మావతి శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అశోక్‌కుమార్ గుప్త, డబ్బీకార్ రాజేశ్వర్, యాకరి యాదగిరి, అర్చకులు సముద్రాల శ్రీనాథాచార్యులు, పొదకదటూరి రవీందర్‌గుప్త, మూరుగుపల్లి నర్సింహ, జంగ అంజయ్య, కొండ స్వామి, ముడుపు రాకేశ్, తుమ్మల ఇస్తారి పాల్గొన్నారు.

కారు బోల్తా..

- నలుగురికి తీవ్రగాయాలు

మోత్కూరు, ఫిబ్రవరి 3 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం కారు బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. భూపాలపల్లి జిల్లాకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ఆత్మకూరు(ఎం) మండలంలోని చాడకు చెందిన రాజు, దుబ్బాకకు చెందిన రంజిత్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన అశోక్ కొంతకాలంగా మార్కెటింగ్‌లో పని చేస్తున్నారు. జనగామ నుంచి మోత్కూరుకు కారులో వస్తుండగా జామచెట్లబావి క్రాస్‌రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలె నలుగురికి తీవ్రగాయాలు కావడంతో భువనగిరి ప్రభుత్వ దవఖానకు తరలించారు.